సాక్షి కర్నూలు

బుధవారం, 18, అక్టోబర్, 2023



రైల్వే డీఆర్ఎం తనిఖీ

బొమ్మలసత్రం: రైల్వే శాఖ గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ మంగళవారం నంద్యాల రైల్వే స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.



వెండి కిరీటం బహూకరణ

మహానంది:కామేశ్వరీదేవికి నంద్యాలకు చెందిన నాగేశ్వరరావు, కావ్యశ్రీ దంపతులు సుమారు రెండు కిలోల వెండి కిరీటం, అభయ వరద హస్తాలు, పద్మ, శంఖ హస్తాలు బహూకరించారు.



ప్రగతి పథంలో నడిపిస్తున్నాం

మారుమూల గ్రామాలను సైతం ప్రగతి పథంలో నడిపిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన అన్నారు.

- వివరాలు IIలో▸

న్యూస్‌రీల్

కారుణ్య నియామకాల అభ్యర్థులకు కౌన్సెలింగ్

- 32 మందికి 31హాజరు..గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు



కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థుల నుంచి సంతకాలు తీసుకుంటున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : కారుణ్య నియామకాలకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం డీఆర్వో కె.మధుసూధన రావు నేతృత్వంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. 32 మందికి గాను 31 మంది హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ కోవిడ్‌తో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కారుణ్య నియామకాలకు ఎంపిక చేసింది. వీరికి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించిన విషయం విదితమే. ఇటీవలే డీఆర్వో, జెడ్పీ సీఈఓ నేతృత్వంలోని కమిటీ ఎంపికైన 32 మంది కారుణ్య నియామకాదారుల నుంచి శాఖల కేటాయింపు ఆప్షన్ తీసుకుంది. ఈ క్రమంలో మంగళవారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు రోజుల్లో ఉద్యోగ నియామక పత్రాలు అందజేసేందుకు అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనాథ్, ఆర్టీసీ అధికారులు సుధాకర్, ఫణీంద్ర పాల్గొన్నారు.

ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



కేంద్రంలోకి వెళ్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్):కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో ఓటింగ్ పరికరాల పనితీరుకు సంబంధించిన ఫస్టు లెవల్ చెక్ ప్రక్రియను కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిశీలించారు. మంగళవారం సాయంత్రం ఆమె కేంద్రంలోకి వెళ్లి బెల్ ఇంజినీర్లు చేపడుతున్న ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనలు ప్రకారం గుర్తింపు కార్డులు లేని వారిని లోపలికి రానివ్వద్దన్నారు. ప్రక్రియలో గందరగోళం లేకుండా వీవీ ప్యాట్లు, కంట్రోల్, బ్యాలెట్ యూనిట్ల పనితీరును పరిశీలించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాదిరి ఎన్నికల మాదిరిగా ఓటు వేయించాలని, ఆ ఓటు ఏ పార్టీకి పడిందో చూసుకోవాలని, ఆ తరువాత దానిని తొలగించాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట ఎఫ్ఎల్‌సీ సూపర్‌వైజర్, డీపీఓ నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ ఉన్నారు.

మార్కెట్ యార్డుకు రెండు రోజులు సెలవు

ఎమ్మిగనూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మిగనూరు పర్యటన సందర్భంగా ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుకు బుధ, గురువారాలు రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు సెక్రటరీ మధవకృష్ణా రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పర్యటన ఏర్పాట్లలో మార్కెట్ యార్డు సిబ్బంది, అధికార యంత్రాంగం కూడా పాల్గొంటుందన్నారు. రైతులు, వ్యాపారులు సెలవు విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

దళితుల జీవితాల్లో వెలుగులు

- బాబా సాహెబ్ ఆశయాలకు అనుగుణంగా వైఎస్ జగన్ పాలన
- విద్య, వైద్యం, రాజకీయ, సామాజిక, ఆర్థికాభివృద్ధికి చేస్తున్న సేవలు ఎనలేనివి
- ఇదే విషయం ప్రజలకు చెబుదాం
- 2024 ఎన్నికల్లో మన ప్రభుత్వాన్ని మరోసారి తెచ్చుకుందాం
- బస్సు యాత్ర జయప్రదం సన్నాహక సమావేశంలో జూపూడి ప్రభాకర్, ఎంపీ నందిగామ సురేష్, పార్టీ నాయకులు
- రాయలసీమ జిల్లాల నుంచి తరలివచ్చిన పార్టీ ఎస్సీ ప్రజాప్రతినిధులు, నాయకులు



మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు. చిత్రంలో ఎంపీ సురేష్, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్, సుధాకర్, ఆర్థర్, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): అణగారిన దళిత వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం), పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'సామాజిక న్యాయ బస్సు యాత్ర' ప్రారంభం కానుంది. ఈ యాత్ర జయప్రదం కోసం మంగళవారం కర్నూలులో సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి రాయలసీమ జిల్లాల ఎస్సీ సామాజిక వర్గాల ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ రాష్ట్రంలో పేదరికం నిర్మూలనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పిల్లలు సైతం ప్రపంచాన్ని ఏలాలనే గొప్ప లక్ష్యంతో ఇంగ్లిష్ మీడియం విద్యను తీసుకొచ్చారన్నారు. కానీ దీనిపై చంద్రబాబుతో పాటు వెంకయ్య నాయుడు, ఇతర టీడీపీ నాయకులు వ్యతిరేకిస్తూ కోర్టుల్లో కేసులు వేయించారన్నారు. అయినా సీఎం వైఎస్ జగన్ వెనకడుగు వేయకుండా సీబీఎస్ఈ ద్వారా ఆంగ్ల బోధనకు శ్రీకారం చుట్టారన్నారు. ఒకప్పుడు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తేనే పాలకులు స్పందించేవారని నేడు అడగకముందే జగనన్న వివిధ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చుతున్నారన్నారు. నాణ్యమైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఇలా నాలుగున్నర్లే కాలంలో జగన్ ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించడంతో పాటు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు సామాజిక బస్సు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. బాపట్ల ఎంపీ నందిగాం సురేష్ మాట్లాడుతూ నేడు సమాజంలో దళితులు తలెత్తుకు తిరుగుతున్నారంటే అది కేవలం జగనన్న చలువే అన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. 25వ తేదీ నుంచి నిర్వహించే సామాజిక బస్సు యాత్రలో ప్రతి ఒక దళిత నాయకుడు, కార్యకర్త స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించుకోవాలన్నారు. ఎమ్మెల్యే కాటసాని అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు లబ్ధి పొందారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దళితులకు అన్ని అర్హతలు ఉన్నా పథకాలు దక్కేవి కాదన్నారు. నాడు ఎన్నో అవమానాలకు గురి అయిన తమకు నేడు వైఎస్ జగన్ సమాజంలో గౌరవం, గుర్తింపు తెచ్చారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో- ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ మురళీకృష్ణ, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు రామాంజనేయులు, రమణ, అనంతపురం జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు ఆదిమూలపు సతీష్, కిషన్, సురేష్ పాల్గొన్నారు.



హాజరైన రాయలసీమ జిల్లాల పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు

> రాష్ట్రంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ తెచ్చిన పథకాలను గతంలో ఏ ప్రభుత్వం తేలేదు. చెప్పిన వాటితో పాటు చెప్పనివి సైతం ఆచరణలో పెట్టారు
>
> -తొగురు ఆర్థర్, నందికొట్కూరు ఎమ్మెల్యే

> ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ పథకాల ప్రయోజనాల కోసం తిరిగిన దళితులకు ఇప్పుడు సీఎం జగన్ వారి ఇంటి వద్దకే తీసుకొచ్చి అందిస్తున్నారు.
>
> - డాక్టర్ సుధాకర్, కోడుమూరు ఎమ్మెల్యే

> టీడీపీ సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తోంది. బలహీన వర్గాలను ఎదగనీయకుండా పేదలుగానే ఉంచుతుంది. అడగకముందే ఎంతో మంచి చేస్తున్న జగనన్నకు మద్దతుగా నిలవాలి.
>
> - డాక్టర్ సంజీవ్‌కుమార్,కర్నూలు ఎంపీ

> బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ చేసినట్లు ఎవ్వరూ చేయలేదు. పేదల బతుకులను మార్చిన నాయకుడు ఆయన.
>
> - లబ్బి వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే

> 2004లో వైఎస్ఆర్ ఆదర్శ గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దితే, నేడు సీఎం జగన్ సంక్షేమ పథకాలతో పేదల బతుకులు మార్చారు.
>
> - కాటసాని రాంభూపాల్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు

> పేదలకు మంచి చేయాలనే ఆలోచనతో నిరంతరం శ్రమించే నాయకుడు సీఎం జగన్. కేవలం నాలుగున్నరేళ్ల కాలంలోనే ఎంతో మేలు చేశారు. మరోసారి గెలిపిస్తే మరింత ఎక్కువ మేలు చేస్తారు.
>
> - బీవై రామయ్య, వైఎస్ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు

> ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను సీఎం జగన్ తన వాళ్లుగా భావిస్తారు. అలాంటి నాయకుడికి మనమందరం అండగా నిలబడాల్సిన అవసరం ఎంతో ఉంది.
>
> - హఫీజ్‌ఖాన్, కర్నూలు ఎమ్మెల్యే

> దళితులుగా పుట్టి ఉంటే మాకూ ఎంతో మంచి జరిగేదని మాలాంటి వారు సైతం అనుకునేంతగా సీఎం జగన్ మేలు చేస్తున్నారు.
>
> - ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

21న ప్రత్యేక విద్యుత్ అదాలత్

కర్నూలు (రాజ్‌విహార్) : విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 21వ తేదీన ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని పవర్‌హౌస్‌లో జరిగే ఈ కార్యక్రమానికి చైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి (రిటైర్డ్ జడ్జి), సభ్యులు కె.రామమోహన్ రావు, ఎల్.అంజని కుమార్, జి.ఈశ్వరమ్మ హాజరవుతారన్నారు. కర్నూలు డివిజన్ పరిధిలోని వినియోగదారులు, రైతులు విద్యుత్ అదాలత్‌లో తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

847.80 అడుగులుగా శ్రీశైల డ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాంనీటి మట్టం మంగళవారం సాయంత్రం సమయానికి 847.80 అడుగులకు చేరుకుంది. జలాశయానికి కొద్దిరోజులుగా వరద ప్రవాహం నిలిచిపోయిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి మంగళవారం వరకు దిగువ ప్రాంతాలకు 6,740 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో స్వల్పంగా 0.118 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జున సాగర్‌కు 221 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వా రా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతల కు 564 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతలకు 338 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,510 క్యూసెక్కుల నీటిని వదిలారు.

నేడు ఫిష్ సూపర్ రెస్టారెంట్ ప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఫిష్ ఆంధ్ర కింద ఏర్పాటు చేస్తున్న ఫిష్ సూపర్ రెస్టారెంట్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ సృజన ప్రారంభించనున్నారు. కల్లూరు ప్రాంతానికి చెందిన ఎం.రేణుకకు ప్రభుత్వం ఈ రెస్టారెంట్‌ను మంజూరు చేసింది. యూనిట్ కాస్ట్ రూ.20 లక్షలు కాగా 60 శాతం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద సబ్సిడీ ఇస్తున్నట్లు మత్స్యశాఖ ఏడీ శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

19న ఎమ్మిగనూరుకు సీఎం వైఎస్ జగన్

- జగనన్న చేదోడు కింద రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఆర్థిక సాయం

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు పర్యటన అధికారికంగా ఖరారైంది. ఈనెల 19న ఆయన ఎమ్మిగనూరు బహిరంగసభలో జగనన్న చేదోడు కింద ఎంపికైన రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున బటన్ నొక్కి నేరుగా వారి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నారు. ఈమేరకు ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. ఇందులో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సీఎం పర్యటన ఏర్పాట్లను ఈనెల 15న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

సీఎం పర్యటన సాగుతుందిలా..

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 19న ఉదయం 8.30 గంటలకు విజయవాడలోని గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.
- 9.45 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి 9.55 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 10.15 గంటలకు చేరుకుంటారు. అక్కడ 10 నిముషాలపాటు ప్రజాప్రతినిధులతో ముచ్చటిస్తారు.
- అక్కడి నుంచి 10.35 గంటలకు ఎమ్మిగనూరులోని చేనేత కాలనీలో ఉన్న వైఎంసీడబ్ల్యూ గ్రౌండ్‌కు చేరుకుంటారు.
- 11.05-11.10 గంటల మధ్య జగనన్న చేదో డుపై రూపొందించిన షార్ట్ వీడియోను ప్రదర్శిస్తారు.
- 11.10 నుంచి 11.55 గంటల వరకు సీఎం వైఎస్ జగన్ లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు.
- 11.55 నుంచి 12 గంటల మధ్య జగనన్న చేదోడు లబ్ధిదారుల ఖాతాల్లో ఆన్‌లైన్ ద్వారా నగదు జమ చేస్తారు.
- 12.20 నుంచి 12.50 మధ్య తిరిగి హెలిప్యాడ్ చేరుకొని ప్రజాప్రతినిధులు, అనారోగ్యంతో బాధపడే వారితో మాట్లాడతారు.
- 01.15 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు,అక్కడినుంచి గన్నవరం చేరుకుంటారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న తలశిల రఘురాం, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జిల్లా కలెక్టర్ సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్



సిద్ధమైన సభా ప్రాంగణం

పకడ్బందీగా సీఎం పర్యటన ఏర్పాట్లు

ఎమ్మిగనూరు టౌన్: జగనన్న చేదోడు పథకం కింద నాల్గవ విడత ఆర్థిక సహాయం మంజూరుకు ఈనెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరుకు రానుండటంతో జిల్లా ఉన్నతాధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జిల్లా కలెక్టర్ సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌లు సభాస్థలిని, హెలిప్యాడ్‌ను పరిశీలించారు. స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో ఏర్పాటు చేస్తున్న సభ స్థలిని పరిశీలించిన తలశిల రఘురాం భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్, సభావేదిక, రోడ్‌షో తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు.

పటిష్ట బందోబస్తు

కర్నూలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు పర్యటన నేపథ్యంలో పోలీసు శాఖ పటిష్ట భద్రతపై దృష్టి సారించింది. ఈనెల 19న ఎమ్మిగనూరు వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ మైదానంలో నిర్వహిస్తున్న బహిరంగ సభ, ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభ, బారికేడింగ్, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర ఏర్పాట్లపై ఎస్పీ ఆరా తీశారు. ఆదోని బైపాస్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను కూడా పరిశీలించారు. దాదాపు 1500 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేశారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్ బాబు, సీసీఎస్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రావు, ఎరీషా వలి, ఇతర ప్రభుత్వ శాఖ అధికారులు సీఎం పర్యటన ఏర్పాట్లలో పాల్గొన్నారు.

గ్రేడ్ -2 పీఎస్‌ల వివరాలు కోరిన సీపీఆర్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్ -2 పంచాయతీ కార్యదర్శుల వివరాలను పంచాయతీరాజ్ కమిషనరేట్ కోరినట్లు డీపీఓ టి. నాగరాజునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో 8 మంది గ్రేడ్ -2 పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరికి సంబంధించి పుట్టిన తేది, ఉద్యోగంలో ఎప్పుడు చేరారు ? విధుల్లో చేరి నప్పటి గ్రేడ్‌లో ఎంత కాలం పనిచేశారు? చార్జెస్ ఏమైనా ఉన్నాయా, డిపార్ట్‌మెంటల్ టెస్ట్ ఎప్పుడు ఉత్తీర్ణులయ్యారు? ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం తదితర వివరాలు కోరారని, వాటిని పంపుతున్నట్లు డీపీఓ వెల్లడించారు.

ప్రశాంతంగా డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్ష

కర్నూలు (న్యూసిటీ): ఆర్‌యూ పరిధిలో మంగళవారం డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఐదు సెమిస్టర్లలో అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించి ఆరో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు మాత్రమే ఫెయిలైన విద్యార్థులకు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. ఇన్‌స్టెంట్ పరీక్షకు 576 మందికి గానూ 564 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు



మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూసిటీ) : ఎవరైనా అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. ఆదోని మండలంలోని ఎస్.కొండాపురం ఎర్ర కొండల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఫిర్యాదు రావడంతో జిల్లా మైనింగ్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. అక్కడ మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి రూ.5 వేలు జరిమానా విధించారు. తనిఖీల్లో గనుల శాఖ విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న శీలం శివ

ఆళ్లగడ్డ: నల్లమల అటవీ ప్రాంతంలోని గండ్లేరు రిజార్వాయర్ వద్ద మంగళవారం రాత్రి హరినగరానికి చెందిన శీలం శివ అనే వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రిజర్వాయర్‌లో చేపల వేటకు వలలను ఏర్పాటు చేసేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లారు. ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో పొదల్లో నుంచి ఎలుగుబంటి వచ్చి దాడి చేసింది. అతని వెనుక వస్తున్న చేపల వేటగాళ్లు కేకలు వేయడంతో ఎలుగుబంటి అక్కడి నుంచి వెళ్లిపోయింది. గాయపడిన శివను చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై రేంజి అధికారి శ్రీప్రతినాయుడిని వివరణ కోరగా తమకు సమాచారం అందిందని విచారణ జరుపుతున్నామన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- వాహనాన్ని వదిలి దుండగుల పరారీ



స్కార్పియో వాహనంలో ఎర్రచందనం దుంగలు

చాగలమర్రి: స్థానిక జాతీయ రహదారిపై విజయ డెయిరీ సమీపంలో స్కార్పియో వాహనంతో పాటు అందులో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను గుర్తుతెలియని దుండగులు వదిలి పారిపోయారు. టోల్‌ప్లాజా వద్ద సోమవారం రాత్రి ఆళ్లగడ్డ గ్రామీణ సీఐ, ఉయ్యాలవాడ ఎస్ఐ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న స్మగ్లర్లు విజయ డెయిరీ సమీపంలో వాహనాన్ని నిలిపారు. అదే సమయంలో సేఫ్టీ వాహన సిబ్బంది ప్రత్యేక వాహనంలో వస్తుండటంతో పోలీసులుగా అనుమానించి స్కార్పియో వాహనాన్ని వదిలి పారిపోయారు. వాహనాన్ని, ఎర్రచందనం దుంగలను ఎస్ఐ రమణయ్య చాగలమర్రి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రావణ వాహనంపై ఆదిదంపతులు

- చంద్రఘంటా అలంకారంలో శ్రీశైల భ్రామరీ
- శ్రీగిరిలో అధ్యాత్మిక భరితంగా సాగుతున్న దసరా మహోత్సవాలు



శ్రీశైలంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో దేవీ శరనవరాత్రోత్సవాలు ఆధ్యాత్మిక భరితంగా సాగుతున్నాయి. అమ్మవారి అపురూప అలంకరణ సేవలు, ఆదిదంపతుల గ్రామోత్సవం, కళాకారుల విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి. దసరా మహోత్సవాల్లో మూడవరోజు మంగళవారం శ్రీశైల భ్రమరాంబాదేవి చంద్రఘంటా అలంకారంలో దర్శనమిచ్చారు. సింహ వాహనాన్ని అధిష్ఠించిన అమ్మవారు పద్మం, బాణం, ధనుస్సు, అభయ హస్తం, జపమాల, త్రిశూలం, గద, ఖడ్గం, పంచ ముద్ర కమండలం ధరించి యుద్ధోన్ముఖురాలై భక్తులకు దర్శనమిచ్చారు. దుష్ట రాక్షస సంహారం కోసం ప్రచండ రూపాన్ని ధరించే అమ్మవారు కార్యరూపిణిగా చంద్రఘంట స్వరూపంలో భక్తులను కటాక్షిస్తారు. దశ భుజాలను కలిగి ప్రశాంతమైన వదనంతో సాత్విక స్వరూపిణిగా ఉంటుంది. ఈ దేవిని శాంతిస్వరూపిణి అయినప్పటికి యుద్ధోన్ముఖురాలై ఉండటం విశేషం. అమ్మవారి మస్తకంపై అర్ధచంద్రుడు అలరాడుతున్న కారణంగా ఈ దేవిని చంద్రఘంటాదేవిగా పిలుస్తారు. అమ్మవారి ఆలయం వద్దగల ప్రత్యేక వేదికలో అర్చకులు, వేదపండితులు చంద్రఘంట అలంకీకృత అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. నవదుర్గలలో తృతీయ రూపమైన చంద్రఘంట రూపంలో అమ్మవారిని పూజించడం వలన భక్తుల కష్టాలు తీరుతాయి. ఈ దేవి ఆరాధన వలన సౌమ్యం, వినమ్రత కలుగుతాయి.

రావణవాహనసేవలో స్వామిఅమ్మవార్లు..

దసరా మహోత్సవాల్లో భాగంగా స్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవల్లో మూడవరోజు రావణవాహనసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రావణ వాహనంపై ఉంచి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక హారతులిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం చంద్రఘంట అమ్మవారిని, రావణవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. గ్రామోత్సవంలో డప్పు వాయిద్యాలు, తప్పెటలు, కళాకారుల నృత్యాల నడుమ గ్రామోత్సవం నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేడు..

దసరా మహోత్సవాల్లో భాగంగా బుధవారం భ్రమరాంబాదేవి కూష్మాండదుర్గ అలంకారంలో, స్వామిఅమ్మవార్లు కైలాస వాహనసేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



మహానందిలో మయూర వాహనంపై కొలువైన అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మయూర వాహనంపై చంద్రఘంటదుర్గ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం రాత్రి శ్రీ చంద్రఘంట దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, పండిత బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్త పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో విహరించారు. కార్యక్రమంలో దాత అవ్వారు గౌరీనాథ్ గౌతమ్, వారణాసి రామ్మోహన్‌రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ నృత్యం



గొరవయ్యల కోలాటం



జ్వాలా విన్యాసం చేస్తున్న కళాకారుడు

అహోబిలంలో



ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం దిగువ అహోబిలంలో కొలువైన మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరద స్వాములను కొలువుంచి నవకళస్థాపన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అద్దాల మండపంలో కొలువుంచి ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా దసరా మహోత్సవాల నిర్వహణ

- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



మంత్రి కొట్టు సత్యనారాయణకు స్వాగతం పలుకుతున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: రాష్ట్రంలోని అన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వేకువజామున శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను మంత్రి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిచుకున్నారు. స్వామిఅమ్మవార్ల దర్శనార్థం ప్రధానాలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఈఓ డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం,అ మ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరికి అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ అయా క్షేత్రాల్లో దసరా ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తున్నామన్నారు. అలాగే వసతి, ట్రాఫిక్, లడ్డూప్రసాద విక్రయాలు, ఉచిత అన్నప్రసాద వితరణ తదితర ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలో శ్రీశైలంలో నూతన క్యూ కాంప్లెక్స్,సాలు మండపాలు, క్షేత్రసరిహద్దు వెంబడి ఫెన్సింగ్ తదితర పనులను రూ.110 కోట్లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. మహాకుంభాభిషేకం విషయం కోర్టు పరిధిలో ఉందని, కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు.

ప్రమాదవశాత్తూ మహిళ మృతి



భర్త, పిల్లలతో మృతురాలు సునీత (ఫైల్)

దేవనకొండ : వేరుశనగ నూర్పిడి యంత్రంపై పడి ఓ మహిళ మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. . మండలకేంద్రం దేవన కొండకు చెందిన సునీత (24) అనే మహిళ మంగళవారం వేరుశనగ పంటను నూర్పిడి చేస్తుంది. యంత్రం చక్రాలకు ఆమె చీర చుట్టుకోవడంతో దానిపై పడిపోయింది. తీవ్రగాయాలైన ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. మృతురాలి సునీతది ఆస్పరి మండలం. 8 సంవత్సరాల క్రితం దేవనకొండకు చెందిన మధుతో వివాహమైన ఈమెకు కుమారుడు, కుమార్తె సంతానం.

స్టాఫ్ నర్సు అనుమానాస్పద మృతి



శరత్‌కుమారి (ఫైల్)

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణం లోని బీసీ కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న స్టాఫ్ నర్సు శరత్ కుమారి(33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కర్నూలు జిల్లా గూడూరు మండలం నాగలాపురం గ్రామానికి చెందిన శరత్‌కుమారి స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కాంట్రాక్టు పద్ధతిలో 2021 నుంచి స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తోంది. సోమవారం మధ్యాహ్నం విధులు పూర్తి చేసుకొని రాత్రి ఇంటికి చేరుకుంది. మంగళవారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లకపోవడంతో వైద్యశాల సిబ్బంది శరత్‌కుమారి ఇంటి వద్దకు వచ్చి పిలిచినా తలుపు తీయలేదు. దీంతో అనుమానంతో తలుపు తీసి చూసేసరికి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వీరాంజనేయులు సంఘటన స్థలానికి వెళ్లీ పరిశీలించి, మృతురాలి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తిలో పెరిగిన గులాబీ పురుగు తీవ్రత

- శాస్త్రవేత్తల సర్వేలో వెల్లడి
- రైతులు సామూహిక నివారణ చర్యలు చేపట్టాలి
- నంద్యాల ఆర్ఏఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త శివరామకృష్ణ వెల్లడి



పత్తిలో గులాబీరంగు పురుగు తీవ్రతను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కర్నూలు(అగ్రికల్చర్): పత్తిలో గులాబీరంగు పురుగు తీవ్రత పెరిగింది. ఇటీవల నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పత్తి శాస్త్రవేత్తల బృందం జిల్లాలోని వివిధ మండలాల్లో పత్తి పంట పొలాలను పరిశీలించి గుర్తించారు. పశ్చిమ ప్రాంతంలోని ఎమ్మిగనూరు, కోడుమూరు, గూడూరు తదితర మండలాల్లో గులాబీరంగు పురుగు ఉధృతి ఆర్థిక నష్ట పరిమితిని దాటినట్లు శాస్త్రవేత్తల బృందం నాయకుడు, సీనియర్ పత్తి శాస్త్రవేత్త డాక్టర్ ఎం శివ రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి పంటకు నష్టం కలిగించే వాటిల్లో గులాబీ పురుగులు ముందు వరుసలో ఉంటాయన్నారు. ఇవి అతి చిన్నవిగా ఉండి కాయ లోపలికి వెళ్లి అందులోని గుజ్జుని తినేయడం ద్వారా పత్తి కాయలు గిడసబారి గుడ్డి పూలుగా మారుతాయి. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. పురుగును అదుపు చేసుకునేందుకు ఎప్పటికప్పుడు గుడ్డిపూలను ఏరివేయాలని, అలాగే ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని సామూహిక నిర్మూలన చేపట్టాలని సూచించారు. పురుగు నష్ట పరిమితిని దాటినప్పుడు వెంటనే ప్రొఫినోఫాస్అనే పురుగుమందును 400 మి.లీ, లేదా ఇండాక్సోకార్బ్ ఎకరాకు 200 మి.లీ, లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ ఎకరాకు 90 గ్రాములు చొప్పున మార్చి, మార్చి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 89194 06382 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు.

పల్లెలను ప్రగతి పథంలో నడిపిస్తున్నాం

- ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మునిమడుగు నుంచి అలేబాదుకు పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్యాపిలి: మారుమూల గ్రామాలను సైతం ప్రగతి పథంలో నడిపిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మునిమడుగు–అలేబాదు, గార్లదిన్నె–అలేబాదుతండా వరకు రూ. 5.5 కోట్లతో వేసిన కొత్త రోడ్లను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గ్రామీణ రహదార్లను పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మారుమూల గ్రామాలకు రోడ్లు వేస్తున్నామన్నారు. డోన్ నియోజకవర్గంలో దాదాపుగా అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించామన్నారు. నియోజకవర్గంలోని పల్లె ప్రజలకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి శుద్ధి చేసిన నీటిని ఇంటింటికీ అందించాలనే లక్ష్యంతో రూ. 300 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులు చేపట్టామన్నారు. మరో రెండు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయన్నారు. తాగు, సాగు నీటి కోసం ప్రజలు వర్షం మీద ఆధారపడకుండా ఉండేందుకు చెరువులు నింపే కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం మంత్రి మునిమడుగు నుంచి అలేబాదు వరకు ఐదు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. పాదయాత్రలో భాగంగా తనను కలిసిన వారితో మంత్రి ఆప్యాయంగా మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బొర్రా మల్లికార్జున రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, బాలయ్య, కేడీసీసీ డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీబాయి, సర్పంచ్ బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భార్య, తల్లిపై దాడి

- ముఖాలపై వేడి పాలు చల్లడంతో తీవ్ర గాయాలు

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన బొగ్గుల రవికుమార్ తన భార్య నాగమణి, తల్లి లింగమ్మపై వేడివేడి పాలు చల్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బొగ్గుల తిమ్మయ్య, లింగమ్మ దంపతుల కుమారుడు రవికుమార్ మద్యానికి బానిసై ప్రతి రోజు భార్య, తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మంగళవారం భార్యతో రవికుమార్ ఘర్షణ పడుతుండటంతో లింగమ్మ అడ్డు చెప్పబోయింది. దీంతో ఆవేశానికి లోనైన రవికుమార్ ఇద్దరి చంపుతానంటూ ఇంట్లో వేడి చేస్తున్న ఐదు లీటర్ల వేడి పాలను వారి ముఖాలపై చల్లాడు. తీవ్ర గాయాలైన వారిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నారు. బొగ్గుల తిమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతాంగ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించాలి
- పనిచేసే చోట లేని సిబ్బందిపై చర్యలు
- 'డయల్ 1912'కు ఫిర్యాదు చేస్తే సత్వర పరిష్కారం
- సమావేశంలో ఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

కర్నూలు(రాజ్‌విహార్): రైతాంగ సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శించరాదని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కర్నూలు, డోన్ డివిజన్లలో జరిగిన, జరుగుతున్న పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు సంబంధించిన పనులతో పాటు సేవల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు.

➡ కర్నూలు, నంద్యాలలో గత 10 నెలల్లో 18,500 విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో జగనన్న కాలనీలో, గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన విన్నపాలు, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

➡ ఉమ్మడి జిల్లాలో గడప గడపకు కార్యక్రమానికి రూ.20కోట్లకు పైగా ఇచ్చామని, ఇకపై అవసరమైన నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

➡ జగనన్న విద్యుత్ సౌకర్యం, బోర్లు, ఇతర సదుపాయాల కల్పనకు రూ.345.30 కోట్లు మంజూరు చేశామని, ఈ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు.

➡ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లో ఇవ్వాలన్నారు.

➡ రూ.116కోట్లతో 29 సబ్ స్టేషన్లు మంజూరు చేశామని, ఈ పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు.

➡ బిల్లుల వసూలులో వంద శాతం లక్ష్యం, విద్యుత్ చౌర్యం, భద్రతపై వినియోగదారులకు అవగాహన కలిగించే చర్యలు చేపట్టాలన్నారు.

➡ ఏఈ మొదలు ఏడీఈ, ఈఈ, ఎస్ఈలు తప్పనిసరిగా పనిచేసే ప్రాంతంలో నివాసం ఉండాలని, లేనిపక్షంలో టీఏ, డీఏలు నిలిపివేస్తామన్నారు.

➡ కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను 48గంటల్లోపు కొత్తవి అమర్చాలన్నారు.

➡ వినియోగదారులకు ఏ సమస్య వచ్చినా 1912కు ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చన్నారు. సమావేశంలో సీజీఎంలు కె.గురువయ్య, కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని, కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి, ఈఈలు, ఎస్ఏఓ, డీఈఈలు, ఏఈఈ, ఏఓలు, ఏఏఓలు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

ఆదోనిఅర్బన్ : ఐదుగురు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను మంగళవారం ఆదోని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన గొల్ల ఈరేష్, బోయగేరికి చెందిన బోయ ఆంజనేయులు, మాసా మసీదుకు చెందిన పింజరి మహ్మద్, గొల్లవీధికి చెందిన గొల్ల విజయ్, కార్వన్‌పేటకు చెందిన మిఠాయివాలే ఉస్మాన్ పట్టణ శివారులోని ఇస్వీ రహదారిలో బాలకొలను వద్ద వరల్డ్‌కప్‌కు సంబంధించి క్రికెట్ బెట్టింగ్ ఆడుతూ, నాటుసారా తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడి చేసి పై ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి రూ.1.98 లక్షల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ విక్రమసింహ తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ సత్తార్‌వలి, పోలీసు సిబ్బంది రామచంద్ర, రంగస్వామి, సుధీకర్‌కుమార్, అశోక్‌కుమార్, సుధాకర్, అల్లెన్న పాల్గొన్నారు.

ప్రతిభ

మన చుట్టూ మనకు తెలియకుండానే ఎంతో మంది రకరకాల బాధలకు లోనవుతుంటారు. వారిలో ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల సమస్యలకు సరైన పరిష్కారం తెలియక ఇబ్బందులు పడుతుంటారు. వారి మానాన వారిని అలాగే వదిలేయడం కన్నా పరిష్కారాన్ని కనుగొంటాను అనుకున్నాడు. తనదైన మార్గంలో ప్రయత్నించాడు. విజయం సాధించాడు. సత్కారాలను పొందుతున్నాడు హైదరాబాద్ వాసి హేమేష్ చదలవాడ.



తల్లి సంధ్యతో హేమేష్ చదలవాడ

అమ్మమ్మలకు అండగా!

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందించిన 21 ఏళ్ల లోపు 20 మంది యువ సాధకులను ఢిల్లీలో మొన్న జరిగిన 'అన్‌స్టాపబుల్ 21' వేదికగా సత్కరించారు. హ్యూమన్ స్టడీస్, సైన్స్, క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్, సోషల్ ఇంపాక్ట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే ఏడు రంగాలలో ప్రతిభావంతులైన యువతకు ఈ సత్కారాన్ని అందజేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల హేమేష్ చదలవాడ ఎలక్ట్రానిక్స్ రంగంలో కనబరిచిన ప్రతిభకు గుర్తింపు పొందాడు.



హేమేష్ తయారుచేసిన డివైజ్

మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతో మందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను.
– హేమేష్

వృద్ధులకు సహాయం..

హేమేష్ పన్నెండేళ్ల వయసు నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగంలో గణనీయమైన ప్రతిభను చూపుతున్నాడు. అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న అమ్మమ్మను చూసి ఆమెకు ఏదైనా సాయం చేయాలనుకున్నాడు. తన ఆలోచనల గురించి హేమేష్ చెబుతూ 'నడిచేటప్పుడు అమ్మమ్మ అడుగులు తడబడుతుండేవి. మతిమరపు ఉండేది. ఆమెకు తన మీద తనకు కంట్రోల్ ఉండేది కాదు. కొన్నిసార్లు అర్ధరాత్రి మంచంపై నుంచి లేచి ఎటో వెళ్లిపోయేది. దీంతో ఆమెను కనిపెట్టి ఉండటం కష్టమయ్యేది. అమ్మమ్మకు, ఆమెను చూసుకునే మాకూ ఇదో సవాల్‌గా ఉండేది. కొన్ని అందుబాటులో ఉన్న డివైజ్‌లను ప్రయత్నించి చూశాం. కానీ, ఏ మాత్రం సంతృప్తిగా అనిపించలేదు. అమ్మమ్మకు సాయపడే డివైజ్‌ను నేనే సొంతంగా తయారుచేయాలనుకున్నాను' అని తనలో రూపుదిద్దుకున్న ఆలోచనను వివరిస్తాడు. హేమేష్ కృషి, పట్టుదల, అంకితభావానికి అతని తల్లిదండ్రులు కిశోర్, సంధ్యలు ప్రోత్సాహం అందించారు.

పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఈ పరికరం వాచ్‌లాగా మణికట్టుకూ కట్టుకోవచ్చు. బ్యాడ్జ్‌గానూ ధరించవచ్చు. రోగి నడక, భంగిమ, శరీర ఉష్ణోగ్రత, నాడిని పర్యవేక్షిస్తుంది. నీళ్ల జారిపడుతుండే శబ్దాన్ని కూడా గుర్తించగలదు. మనిషి దూరంగా తిరుగుతున్నప్పుడు లేదా పడిపోవడం వంటి ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే తెలియజేస్తుంది. ఇంకా అలారంలో 'పిల్‌బాక్స్' ఫీచర్ కూడా ఉంటుంది. ఇది రోగులు వారి మందులు తీసుకునే సమయం వచ్చినప్పుడు హెచ్చరికలను పంపుతుంది. 'ఈ డివైజ్ మా అమ్మమ్మ కోసం తయారుచేసినప్పుడు ఇంటర్నెట్ సరైన మార్గం చూపింది. అయితే, ఈ పరికరం పూర్తయ్యే సరికి అమ్మమ్మ చనిపోయారు' అని బాధపడే హేమేష్ డివైజ్ చేతిలో పట్టుకొని 'మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతోమందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను' అని చెబుతున్న హేమేష్ 12వ తరగతి చదువుతున్నాడు. తన తదుపరి ప్రాజెక్ట్స్‌తో ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ రంగంలో మరిన్ని అడుగులు వేస్తున్నట్టుగా వివరించాడు.

2021లో ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకున్నాడు. పేరున్న కంపెనీల నుంచి గ్రాంట్‌లను పొందాడు.

– నిర్మలారెడ్డి


మణిపూర్ ఒక మంచి వార్తను వినిపించింది. ఆ రాష్ట్రానికి చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ తీసిన 'ఆండ్రో డ్రీమ్స్' ముంబైలో జరుగుతున్న చలన చిత్రోత్సవంలో బెస్ట్ డాక్యుమెంటరీగా ఎంపికైంది. మణిపూర్‌లోని మారుమూల గ్రామం 'ఆండ్రో'లో ఆడపిల్లల ఫుట్‌బాల్ క్లబ్‌ను 30 ఏళ్లుగా పరిస్థితులకు ఎదురీది నడుపుతున్న 'లైబి' అనే మహిళ పోరాటాన్ని ఈ డాక్యుమెంటరీ రికార్డు చేసింది. ఆడపిల్లల క్రీడా స్వేచ్ఛను ఎన్ని అడ్డంకులొచ్చినా కొనసాగనివ్వాలనే సందేశం ఇచ్చే ఈ డాక్యుమెంటరీ దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతోంది.

అడ్డంకులను దూరంగా తన్ని...



దర్శకురాలు: మీరా లాంగ్‌జామ్

న్యూస్‌మేకర్



ఆండ్రో డ్రీమ్స్ పోస్టర్

అంతా చేసి ఎనిమిది వేల మంది జనాభా మించని ఊరు ఆండ్రో. మణిపూర్ తూర్పు ఇంఫాల్ జిల్లాలో మారుమూల ఉంటుంది అది. అక్కడి ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడితే ఏంటి... ఆడకపోతే ఏంటి? కాని 60 ఏళ్ల లైబి మాత్రం– ఆడాల్సిందే అంటోంది. ఆమె గత ముప్పై ఏళ్లుగా 'ఆండ్రో మహిళా మండల్ అసోసియేషన్– ఫుట్‌బాల్ క్లబ్' (అమ్మ– ఎఫ్‌సీ) నడుపుతోంది. ఈ క్లబ్‌కు నిధులు లేవు. బిల్డింగ్ లేదు. ఊళ్లో ప్రోత్సాహం లేదూ, ఏమీ లేదు. కాని లైబి మాత్రం అంతా తానై క్లబ్‌ను నడుపుతోంది. ఈ మధ్యే ఆమె ఒక పూరి పాక నిర్మించి దానినే క్లబ్ బిల్డింగ్‌గా ప్రారంభించుకుంది.

'అమ్మాయిలు కేవలం వంటకు, ఇంటి పనికి అంకితమై పోకూడదు. చదువుకోవాలి. ఆడాలి. ధైర్యంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి. మా ప్రాంతంలో పురుషులదే సర్వాధికారం. ఇంటి పెద్ద, తెగ పెద్ద ఎంత చెప్తే అంత. వారి దృష్టిలో ఆడవాళ్ల గురించి చింతించాల్సింది ఏమీ ఉండదు. అమ్మాయిలు ఆడతామన్నా ఒప్పుకోరు. నా పోరాటం వల్లే ఇవాళ మా ఊరి నుంచి జాతీయ స్థాయిలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు' అంటుంది లైబి.



తన ఫుట్‌బాల్ క్లబ్ పూరి పాక ముందు లైబి

ఈమె పోరాటం ప్రపంచానికి చెప్పదగ్గది అనిపించింది మణిపూర్‌కే చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్‌కు. అలా తయారైన డాక్యుమెంటరీనే 'ఆండ్రో డ్రీమ్స్'.

ఇద్దరి కథ

ప్రస్తుతం ముంబైలో 'జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్' అట్టహాసంగా జరుగుతోంది. ఇందులో 'ఆండ్రో డ్రీమ్స్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఇప్పటికే కేరళ, కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు ఎంపికైన ఈ డాక్యుమెంటరీ ముంబైలో విమర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. 'దీనికి కారణం ఆండ్రోలో అమ్మ క్లబ్‌ను నడుపుతున్న లైబి పోరాటాన్ని, ఆ క్లబ్‌లో గొప్ప ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే నిర్మల అనే అమ్మాయి ఆకాంక్షలని నేను చూపించడమే. ఒక రకంగా చాదస్త వ్యవస్థతో రెండు తరాల స్త్రీల పోరాటం ఈ డాక్యుమెంటరీ' అని తెలిపింది మీనా లాంగ్‌జామ్.

మణిపూర్ వెలుతురు

నిజానికి మే 3వ తేదీ నుంచి మణిపూర్ వేరే కారణాల రీత్యా వార్తల్లో ఉంది. కాని మణిపూర్‌ను అభిమానించేవారికి ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ సాధిస్తున్న విజయాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. 'నా డాక్యుమెంటరీ విజయం మా ప్రాంతంలో గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెట్టే ఉత్సాహాన్ని ఇస్తే అంతే చాలు' అంది మీనా లాంగ్‌జామ్. మణిపూర్ యూనివర్సిటీలో కల్చరల్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా పాఠాలు చెప్పడంతో పాటు డాక్యుమెంటరీలు కూడా తీస్తుంది. 2015లో ఆమె మణిపూర్‌లో ఫస్ట్ మహిళా ఆటోడ్రైవర్‌గా ఉన్న లైబీ ఓయినమ్ మీద డాక్యుమెంటరీ తీస్తే దానికి చాలా పేరొచ్చింది. ఆ తర్వాత 'అచౌబీ ఇన్ లవ్' పేరుతో పోలో ఆటకు అనువైన స్థానిక జాతి అశ్వాలపై డాక్యుమెంటరీ తీస్తే దానికీ పేరొచ్చింది. ఇప్పుడు 'ఆండ్రో డ్రీమ్స్' మణిపూర్ ఘనతను చాటుతోంది.

బాలికలు, యువతులు క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆంక్షలు ఉండనే ఉంటాయి. అలాంటి ప్రతి చోట అమ్మాయిలను ప్రోత్సహించే లైబి లాంటి యోధురాళ్లు, వారి గెలుపు గాథలను లోకానికి తెలిపే మీనా లాంటి వాళ్లు ఉండాలని కోరుకుందాం.

● ఆటో అన్సారీ

లైఫ్ గేర్ మార్చింది



నజ్మా అన్సారీ

ఓ యువకుడు యాచకుడి వేషంలో, కేజీల మొత్తంలో కరెన్సీ నాణేలను తీసుకుని ఐఫోన్ కొనడానికి వెళ్లిన వార్త ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. మంచి వయసు, ఓపిక ఉన్న వారే ఇలా చేస్తుంటే... ఓపిక లేకపోయినా సమాజంలో గౌరవంగా బతికేందుకు బురఖా వేసుకుని ఆటో నడుపుతోంది నజ్మా అన్సారీ. అయినా ఇతరుల ముందు చేయి చాచే కంటే.. కష్టపడడమే గౌరవం అనుకుంది. 'గేర్లు మార్చేయండి చాలు గౌరంగా బతకవచ్చు' అని చెబుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



నజ్మా అన్సారీ వయసు 45. ఉత్తరప్రదేశ్, మొరాదాబాద్ నగరంలోని కట్‌ఘర్‌లో ఆమె నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. 2010లో భర్త మరణించడంతో ఇంటి భారం ఆమె మీద పడింది. అప్పటిదాక గృహిణిగా ఉన్న నజ్మాకు తన కొడుకు, కూతుర్ని ఎలా పెంచాలో అర్థం కాలేదు. భర్త నడిపిన టీషాపును అద్దె కట్టలేక వదిలేసింది. ఇంట్లోనే టీ తయారు చేసి విక్రయించింది. అలా పిల్లల అవసరాలు చూసుకుంటూ ఉండగానే భర్త ఇన్సురెన్స్ డబ్బులు రూ.4.35 లక్షలు వచ్చాయి. మూడు లక్షల రూపాయలతో 2015లో కూతురికి పెళ్లి చేసింది.

ఆదాయం సరిపోక..

టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్న నజ్మాకు డబ్బులు సరిపోయేవి కావు. కూతురి పెళ్లి తరువాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో భర్త ఇన్సురెన్స్ డబ్బుల్లో మిగిలిన మొత్తంతో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కుంది. ఇంటి పనులన్నీ పూర్తిచేసి ఆటో తోలుతూ సంపాదిస్తోంది.

అర్ధరాత్రనే భయం లేదు

నజ్మా మూడు షిఫ్టుల్లో ఆటో నడుపుతోంది. బురఖా ధరించి ఉదయం తొమ్మిదిగంటలకు ఆటో స్టార్ట్ చేస్తుంది. ఎండ వేడికి బురఖాలో ఎక్కువ సమయం ఉండలేక మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేస్తుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆటో నడుపుతోంది. మళ్లీ రాత్రి తొమ్మిది నుంచి రెండుగంటల వరకు విరామం లేకుండా నడుపుతుంది. ఇలా మూడు షిఫ్టుల్లో మొత్తం మీద రోజుకి ఐదు నుంచి ఆరు వందల వరకు సంపాదిస్తోంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు నజ్మా ధైర్యాన్ని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే నజ్మాను చూసిన ఓ హిందూ మహిళ కూడా ఆటో నడపడం మొదలు పెట్టింది. దీంతో ఆ మహిళ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగు పడ్డాయి. ఇలా ఇతరులకు స్ఫూర్తి నిలుస్తూనే, తన కష్టార్జితంతో హజ్ యాత్రకు వెళ్తానని చెబుతోంది నజ్మా.

అడుక్కునే కంటే...

''పేదరికం ఉందని అక్కడా ఇక్కడా చేయి చాచకుండా కష్టపడి ఏ పనైనా చేసి గౌరవంగా బతకవచ్చు. ఆటో గేర్లు మారుస్తూ, ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తున్నాను. ఇక మహిళా డ్రైవర్‌గా నాకు రాత్రి సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బంది ఎదురు కాలేదు. ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వం వచ్చాక అర్ధరాత్రి బయటకు రావడానికి కూడా భయం వేయడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మాకు రక్షణ కల్పిస్తోంది. పరిస్థితులు మరింత దిగజారినప్పుడు అల్లా కాపాడతాడు'' అని నజ్మా అన్సారీ ధైర్యంగా చెబుతోంది.

యూత్ పల్స్

'ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూశారు. ఇక డీఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూసే టైమ్ వచ్చింది'... ఇది తెలుగు సినిమాలో మాస్ డైలాగ్ కాదు. సోషల్ మీడియాలో ఒక కుర్రాడు పెట్టిన కామెంట్. సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల హవా నడుస్తున్న కాలం ఇది. కస్టమర్‌లు ఏది కొనాలో, ఏ షో చూడాలో, ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతున్నారు. ఇప్పుడు ఈ ట్రెండ్‌కు అడ్డుపడే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్ యువతరం నుంచే వచ్చి బలపడుతోంది. ట్రెడిషనల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ప్రొడక్ట్‌ను హైప్ చేస్తే డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆ హైప్‌ను ఛాలెంజ్ చేస్తున్నారు....

ధీ అంటే ధీ

ఆర్ట్ ఆఫ్ డీఇన్‌ఫ్లుయెన్సింగ్





సమస్య ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కాదు. కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు అనుసరిస్తున్న ధోరణి. వారిలో మార్పు రావాలి. సామాజిక బాధ్యత పెరగాలి. యువతలో అశాంతి, ఆందోళన రేకెత్తించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి.
– హిమాద్రి పటేల్, డిజిటల్ క్రియేటర్

మార్కెటింగ్ డాటా అండ్ ఎనలిటిక్స్ కంపెనీ కంతార్ స్టడీ రిపోర్ట్ ప్రకారం వినియోగదారులపై ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సిఫారసుల ప్రభావం తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో ఎటు చూసినా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కనిపిస్తారు. టీ పొడుల నుంచి టీపాయ్‌ల వరకు రకరకాల ప్రొడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి చిన్నచిన్న క్యాచీ వీడియోలను రూపొందిస్తారు. దీనికి భిన్నంగా ఒక ప్రొడక్ట్‌ను విశ్లేషిస్తూ విమర్శిస్తే...అదే డీఇన్‌ఫ్లుయెన్సింగ్!

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' హ్యాష్‌ట్యాగ్‌తో టిక్ టాక్‌లో ఈ ట్రెండ్ మొదలైంది.

సోషల్ మీడియా ఎనాలటిక్స్ ఫర్మ్ ట్యూబ్‌లర్ ల్యాబ్స్ చెబుతున్నదాని ప్రకారం గత సంవత్సరం నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. మ్యాడి వెల్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రముఖ కాస్మటిక్ స్టోర్స్‌లో పని చేసింది. కొన్ని ప్రొడక్ట్స్ పట్ల కస్టమర్‌లు ఎందుకు విముఖంగా ఉన్నారో తన స్వీయ అనుభవాలను తెలియజేసింది. ఈ ప్రభావంతో ఆమె పేరు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితా నుంచి డీఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితాలోకి చేరింది.

న్యూయార్క్‌కు చెందిన ఇరవై సంవత్సరాల క్లారా కొన్ని బ్రాండ్‌లను విమర్శిస్తూ వీడియోలు చేసింది. వాటిలో ఒకటి వైరల్‌గా మారింది. అదే సమయంలో తాను విమర్శించిన బ్రాండ్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే భయం పట్టుకుంది. అయితే తనకు తానుగా ధైర్యం తెచ్చుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

'నేను సరియైన వివరాలతోనే వీడియో చేశాను. నేనెందుకు భయపడాలి' అంటోంది క్లారా.

మన సెలబ్రిటీ ఒకరు ఆరోగ్య సంబంధమైన విషయాలపై కాస్త లోతుగానే మాట్లాడాడు. అయితే ఆయన అవగాహన లోపాన్ని ఒక వైద్యుడు వెంటనే ఎత్తిచూపాడు. పాపులర్ చైనీస్ వ్లోగర్ ఒకరు తన వయసు తక్కువగా కనిపించేలా సాంకేతిక మాయ చేస్తే ఎవరో కుర్రాడు కనిపెట్టి 'ఆయన అసలు రూపం ఇది' అని చూపాడు.

స్వీడన్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఫేక్ ట్రిప్ గురించి మరొక యువకుడు 'ఇవి ఫొటోషాప్ చిత్రాలు' అని నిజాన్ని బహిర్గతం చేశాడు. నిజానికి ఇలాంటివి సోషల్ మీడియాలో గతంలో లేవని కాదు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' పుణ్యామా అని 'అది కాదు ఇది' అని వెంటనే సాధికార సమాచారంతో స్పందించే ధోరణి పెరిగింది.

డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు వోవర్–హైప్డ్ ప్రొడక్ట్స్‌ను విమర్శించడమే కాదు చౌక ధరల్లో లభించే వాటి గురించి చెబుతున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్ అయిన అమెరికస్ రీడ్ ఇలా అంటున్నారు... 'ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువ మంది సాధికారికంగా మాట్లాడడం లేదేమో అనే భావన కస్టమర్‌లలో వచ్చింది. డబ్బులు ఇస్తారు కాబట్టి సంబంధిత ప్రొడక్ట్‌ను ప్రమోట్ చేస్తారు. నిజానిజాల గురించి వారికి అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో డీఇన్‌ఫ్లుయెన్సరే నయం అనుకుంటున్నారు. నిజానికి డీఇన్‌ఫ్లుయెన్సర్ కూడా ఇన్‌ఫ్లుయెన్సరే'

కొందరు ఒక అడుగు ముందుకు వేసి ఈ ట్రెండ్‌కు 'యాంటీ క్యాపిటలిస్ట్' ట్రెండ్‌గా నామకరణం చేశారు.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ వల్ల వృథా ఖర్చులు తగ్గుతాయని, వేలం వెర్రికి అడ్డుకట్టపడుతుందని, పర్యావరణ కోణంలో కూడా ఈ ట్రెండ్ వల్ల మేలు జరుగుతుందని యువతరంలో ఎంతోమంది బలంగా వాదిస్తున్నారు. తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలో ఇతరులతో పంచుకుంటున్నారు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్‌పై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఉన్నాయి.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్‌కు విషయ సాధికారత, నిజాయితీ అనేవి కీలకం. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' రూపంలో సూడో–అథెంటిసిటీ ముందుకు వస్తుందని, ఈ ట్రెండ్‌ను తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే విమర్శ ఉంది.

'ఈ ట్రెండ్ కాస్త చివరికి ఎలా మారుతుందంటే ఇది కొనవద్దు. మీరు కొనాల్సింది అది అన్నట్లుగా!' అంటుంది 26 సంవత్సరాల అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జెస్సిక.

'ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చెప్పగానే కస్టమర్‌ల అభిప్రాయాలు రాత్రికి రాత్రి మారిపోవు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కేవలం సలహా ఇస్తారు. అంతే. ఏది కొనాలి, ఏది కొనకూడదు అనే స్వీయవిచక్షణ కస్టమర్‌లలో ఉంది. ఇన్‌ఫ్లుయెన్సర్‌లుగా మేము పారదర్శకంగా, నిజాయితీగా ఉంటాం' అంటుంది ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కోలిన్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4,00,000 ఫాలోవర్స్ ఉన్నారు.

ప్రస్తుతం డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ హెల్త్, ఫైనాన్స్, లైఫ్‌స్టైల్ విభాగాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్ అనేది వాపా బలుపా?' అనేది పక్కన పెడితే ఈ ట్రెండ్ మూలంగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రాఫిట్‌కు మాత్రమే కాదు మెరిట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చే ధోరణి, జవాబుదారీతనం పెరుగుతుంది.

బ్యూటిప్స్



● వేప చెట్టు ఇంటి దగ్గర్లో ఉంటే వేరే సౌందర్యసాధనాలతో పనే ఉండదు. వేపాకులు, బెరడు, వేపనూనె ఔషధాలుగానే కాదు, సౌందర్య సాధనాలుగానూ ఉపయోగపడతాయి. ఎలాంటి చర్మ సమస్యలకైనా వేపతో ఇట్టే చెక్ పెట్టేయవచ్చు. ● ముఖంపై మొటిమలు, నల్లమచ్చలు ఏర్పడుతుంటే వేపాకులతో చక్కని విరుగుడు ఉంది. గుప్పెడు వేపాకులను అరలీటరు నీటిలో వేయాలి. వేపాకులు పూర్తిగా మెత్తగా మారిపోయేంత వరకు ఆ నీటిని మరిగించాలి. కాసేపటికి నీరు ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అప్పుడు వడగట్టి ఆ కషాయాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ నీటితో కాస్త దూదిని తడిపి ముఖాన్ని రుద్దుకుంటే చాలు. మొటిమలు, మచ్చలు మటుమాయం అవుతాయి. ● చర్మం పొడిబారి, తరచు దురదలు పెడుతున్నట్లయితే, పైన చెప్పుకున్నట్లే వేపాకులతో కషాయం చేసి, బకెట్ నీటిలో ఒకకప్పు కషాయాన్ని పోసి ఆ నీటిని స్నానానికి ఉపయోగిస్తే చాలు. కొద్దిరోజుల్లోనే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. ● ముఖం తరచు జిడ్డుగా మారుతుంటే, వేపాకుల పొడి, గంధంపొడి, గులాబి రేకుల పొడి సమభాగాలుగా తీసుకుని కలుపుకోవాలి. చెంచాడు పొడిలో మూడు నాలుగు చుక్కల వేపనూనె, కొద్దిగా తేనె, నిమ్మరసం పిండుకుని ముద్దలా కలుపుకోవాలి. దానిని ముఖానికి పట్టించి, అరగంటసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా మారుతుంది.

